సాక్షి
ప్రకాశం
మంగళవారం। 27। మే। 2025



మేయర్‌పై తిరుగుబాటు.. రెబల్స్‌తో తలపోటు!
పార్టీ ఫిరాయించి టీడీపీలో చేరిన కార్పొరేటర్లు రెబల్స్‌గా మారి మేయర్‌ను మార్చాలంటూ ఎమ్మెల్యేపై ఒత్తిడి చేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. - 8లో..



బ్యాంకు లోన్ పేరుతో రూ.57 లక్షలకు టోకరా
బ్యాంకు లోన్ పేరుతో ఓ పరిశ్రమ యజమాని వద్ద రూ.57 లక్షలు కాజేయడంపై ఎస్పీకి ఫిర్యాదు అందింది. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35 /27
వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ధర పడిపోయి.. జీవితాలు కూలిపోయి

సాక్షి ఫోకస్

కరువు రైతుపై పొగాకు పోటు

- గడిచిన ఐదేళ్లూ లాభాల పంటగా అమ్మకాలు
- గత సంవత్సరం సగటు ధర రూ.274.79
- ప్రస్తుతం ధర తగ్గుతుండటంతో ఆందోళన
- రైతుల వద్ద భారీగా లో గ్రేడ్ పొగాకు నిల్వలు
- 2 మిలియన్ కిలోలు మాత్రమే కొనుగోలు



నిన్నటి వరకూ కరువు మండలాల రైతుకు పొగాకు సాగు లాభాలు పండించింది. నీటి వనరులు తక్కువగా ఉండడంతో ఏళ్లతరబడి సాగుచేస్తున్న సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి తక్కువ నీటితో సాగయ్యే పొగాకుపై రైతులు దృష్టి సారించారు. ఇటు రైతులతో పాటు రైతు కూలీలకు కూడా మంచి ఆదాయం లభిస్తుండటంతో రైతులు పొగాకు సాగుపై ఆసక్తి చూపించారు. ప్రస్తుతం ధరలు పడిపోవడంతో పరిస్థితి తలకిందులైంది. దీనిని నమ్ముకున్న రైతులు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయి.

పొదిలి:

పృధులాపురి రైతుల ధనాగారంగా ఉన్న పొగాకు నేడు పగాకుగా మారుతోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వస్తుందనే ఆశతో పొగాకు సాగుకు మొగ్గు చూపారు. తీవ్ర కరువుతో పంటలకు నీరందుతుందన్న నమ్మకం లేక రైతులు తక్కువ నీటితో సాగయ్యే పొగాకు వైపు ఆసక్తి చూపి సాగుచేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కరువు రైతుపై కోలుకోలేని దెబ్బ పడనుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ సహకారం లోపించడం, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పొగాకు రైతు కుదేలవుతున్నాడు. అధిక మొత్తంలో లో గ్రేడ్ ఉత్పత్తి కావడం, నాణ్యమైన పొగాకు ధర తగ్గుతుండటంతో లో గ్రేడ్ ధరలపై రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలం జరిగే తీరుపై రైతుల్లో అసహనం నెలకొంది. కేంద్రాలకు వస్తున్న అధిక బేళ్లను తిప్పి పంపించివేస్తుండడంతో రైతుపై అదనపు భారం పడుతోంది. ఈ పరిణామాలన్నీ రైతు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

మూడు నెలల పంట.. ఆరు నెలల అమ్మకాలు...

పొగాకు రైతులు నష్టపోయే మరొక సమస్య అమ్మకాలు. సకాలంలో అమ్మకాలు జరిగి డబ్బు చేతికొస్తే పెట్టుబడులకు చేసిన అప్పులు తీర్చుకుంటే వడ్డీలైనా మిగులుతాయి. మూడు నెలల పంట కాలం అయితే ఆరేడు నెలల పాటు అమ్మకాలు జరుగుతున్నాయి. దీంతో పెట్టుబడులకు వడ్డీలు పెరిగిపోవటంతో పాటు దీర్ఘకాలంగా నిల్వ ఉండడంతో పొగాకు నాణ్యత, బరువు తగ్గిపోతున్నాయి. సేద్యాలు చేసినందుకు, పచ్చాకు ముఠాలకు, క్యూరింగ్ కర్రకు, కూలీలకు అప్పులు తెచ్చారు. ఈ సంవత్సరం ఎప్పటికి పూర్తవుతుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు సుమారు 2 మిలియన్ కిలోలు కూడా కొనుగోలు జరగలేదు.

గుబులు పుట్టిస్తున్న లో గ్రేడ్...

ఈ ఏడు వాతావరణం అనుకూలించకపోవటం, లేత ప్లాంటేషన్ల కారణంగా లో గ్రేడ్ ఉత్పత్తి ఎక్కువగా జరిగింది. సుమారు 65 శాతం మేర సగటున లో గ్రేడ్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. సగటున లో గ్రేడ్‌కు రూ.230 ఉంటేనే రైతులు గట్టునపడే అవకాశం ఉంది. లేదంటే అప్పులు మిగిలే ప్రమాదం ఉంది. గ్రేడ్ పొగాకుకే ధరలు ఇచ్చేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవటంతో, అధిక శాతం ఉన్న లో గ్రేడ్ మార్కెట్ తలచుకుంటేనే గుబులు పుడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండగా నిలవాల్సిన టుబాకో బోర్డు, పాలకులు రైతును గాలికొదిలేశారు. కంపెనీలు సిండికేట్‌గా మారి దోపిడీ చేస్తున్నా.. కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

పొదిలి వేలం కేంద్రం పరిధిలోని వివరాలు ఇలా...	
మొత్తం మండలాలు	13
మొత్తం బ్యారన్‌లు	2,602
మొత్తం రైతులు	4,390
అనుమతించిన విస్తీర్ణం	21,335 ఎకరాలు
పొగాకు సాగు విస్తీర్ణం	27,577
అమ్మకాలకు అనుమతి	11.10 మి.కిలోలు
ఉత్పత్తి అంచనా	18 మి.కిలోలు
ఇప్పటి వరకూ కొనుగోలు	2 మి.కిలోలు

జగన్ పాలనలో పొగాకు రైతుకు స్వర్ణయుగం...

వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో పొగాకు రైతుకు స్వర్ణయుగంగా ఉంది. రైతులు పండించిన పొగాకుకు గతంలో ఎన్నడూ లేనంతగా సగటు ధర వచ్చింది. కంపెనీల వారు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుంటే, వెంటనే మార్క్‌ఫెడ్‌కు నిధులిచ్చి పొగాకు కొనుగోలు చేయించారు. దీంతో పలు కంపెనీల వారు చేసేదేమీ లేక పోటీ పడి అధిక ధరలకు పొగాకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో గత సంవత్సరం రూ.274.79 సగటు ధర వచ్చింది. ఈ ఏడు ప్రభుత్వం, బోర్డు పట్టించుకోకపోవడంతో రైతులకు నష్టాలు మిగిలి పొగాకు ధనాగారం వట్టిపోతుందనే ఆందోళన రైతాంగంలో ఉంది.

సంవత్సరం	సాగు విస్తీర్ణం (ఎకరాలలో)	అమ్మకాలు (మిలియన్ కిలోలు)	సగటు ధర (రూపాయలు)
2019-20	19,305	9.35	104.50
2020-21	14,017	6.91	135.54
2021-22	12,432	6.76	167.16
2022-23	19,497	12.29	214.76
2023-24	20,532	13.00	274.79



ప్రతి సంవత్సరం సగటు ధర పెరుగుతుండటంతో రైతులకు లాభాలు వచ్చాయి.

లో గ్రేడ్ ధర నిర్ణయించాలి



ప్రస్తుతం లో గ్రేడ్ అధికంగా వచ్చింది. దానికి ధర నిర్ణయించి సగటు ధర తగ్గకుండా చూస్తేనే రైతులకు మేలు జరుగుతుంది. లేదంటే పొగాకు రైతులు ఇప్పట్లో కోలుకోవడం కష్టం. రూ.230 వరకు లో గ్రేడ్‌ను కొనాలి.
– టి.వెంకటేశ్వరరెడ్డి, కంభాలపాడు

వేలం త్వరితగతిన పూర్తిచేయాలి



వేలం త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. మళ్లీ మొక్కలు నాటే సమయం వచ్చేనాటికి కూడా వేలం సాగుతుంటే రైతులకు నష్టం జరుగుతుంది. నాణ్యత, బరువు కోల్పోయి అదనపు నష్టం వాటిల్లుతుంది.
– పులిగొర్ల శ్రీనివాసరావు, పోతవరం

వేలంలో పోటీ ఉంటేనే ధరలు పెరుగుతాయి



వేలంలో అధిక మొత్తంలో వ్యాపారులు పాల్గొంటున్నప్పటికీ పోటీ మార్కెట్ లేదు. దీంతో ధరలు పెరగటం లేదు. మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం నిధులు కేటాయించి కొనుగోలు చేయించాలి. దీంతో వ్యాపారులు ధరలు పెంచి కొనుగోలు చేస్తారు. జగన్‌మోహన్‌రెడ్డి అలా చేయడం ద్వారానే రైతులకు మేలు జరిగింది.
– పొన్నపాటి శ్రీనివాసరెడ్డి, రాములవీడు

రిటర్న్ బేళ్లు తగ్గించాలి



రిటర్న్ బేళ్లు లేకుండా చూడాలి. దీంతో రైతుకు అదనపు వ్యయం తగ్గుతుంది. ఎండ వేడికి బరువు, నాణ్యత కోల్పోయి పొగాకు రంగు మారిపోతుంది. అటు ఇటు తిప్పడం, బేళ్లు తిరిగి నిర్మించడం రైతులకు తలనొప్పిగా మారుతుంది.
– దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వింజవర్తిపాడు

జగనన్న పర్యటనతో రైతులకు మేలు

పొగాకు రైతుల్లో ధైర్యం నింపేందుకు, వారి సమస్యలు వినేందుకు జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పొగాకు బోర్డుకు రానుండటంతో రైతులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచటం ద్వారా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించేలా చేస్తే ధరలు పెరిగి పొగాకు రైతులకు మేలు జరుగుతుంది.
– గుజ్జుల సంజీవరెడ్డి

జగన్ పర్యటనకు ఏర్పాట్లు వేగవంతం





ఏర్పాట్లను పరిశీలిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, అన్నా రాంబాబు

- పనులను పరిశీలించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నాయకులు

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతుల కష్టాలు స్వయంగా తెలుసుకునేందుకు ఈ నెల 28వ తేదీ పొదిలి పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించనున్న నేపథ్యంలో పొదిలిలో ఆయన పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. జగనన్న పర్యటన ఏర్పాట్లను పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మార్కాపురం సమన్వయకర్త అన్నా రాంబాబు, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి సోమవారం పరిశీలించారు. ముందుగా పొదిలి–దర్శి రోడ్డులోని ఎస్ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్ద జరుగుతున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించారు. నాయకులు, కార్యకర్తలకు సలహాలు, సూచనలు చేశారు. హెలిప్యాడ్ ప్రాంతంలో చెట్ల తొలగింపు, మట్టితోలకం, చదును చేయడం వంటి పనులు వేగవంతం చేయాలని చెప్పారు. జగనన్న పర్యటనకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్తగా భోజనం, మంచి నీరు, తదితరాలను ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే బాగుంటుందనే దానిపై స్థానిక నాయకులతో చర్చించారు. ఆయా ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సాని కొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, కొత్తపులి బ్రహ్మారెడ్డి, వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముమ్మరంగా జరుగుతున్న హెలిప్యాడ్ నిర్మాణ పనులు

కూటమిలో కుంపటి

- టీడీపీ, జనసేన నాయకుల మధ్య పరస్పర వ్యక్తిగత విమర్శలు
- జనసేన నాయకుడు జడా నాగేంద్రంపై పోలీసులకు ఫిర్యాదు
- ఇరుపార్టీల మధ్య పెరుగుతున్న దూరం

ఒంగోలు టౌన్: ఒంగోలు నియోజకవర్గంలో కూటమి పార్టీలైన టీడీపీ–జనసేన నాయకుల మధ్య పరస్పర విమర్శలతో కాక రాజుకుంది. మొన్న మినీ మహానాడులో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జనసేన నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిపై విమర్శలు చేయడంతో కూటమిలో కుంపటి రాజుకుంది. దామచర్ల చేసిన విమర్శలను జనసేన నాయకుడు జడా బాల నాగేంద్రం ఖండించారు. ఆ వెంటనే టీడీపీ నాయకులు స్పందించారు. బాలినేని, జడా నాగేంద్రపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు. తిరిగి సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో టీడీపీ నాయకులను జడా నాగేంద్రం విమర్శించారు. ఆ తర్వాత కొద్దిసేపటికే జడా నాగేంద్రంపై ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్‌లో మండవవారిపాలేనికి చెందిన వ్యక్తులు చీటింగ్ కేసు పెట్టారు. ఆఘమేఘాలపై స్పందించిన పోలీసులు విచారణ పేరుతో నాగేంద్రంను పోలీసుస్టేషన్‌కు పిలిపించారు. కొద్దిసేపు విచారించి పంపించివేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసానికి పాల్పడినట్లు మారెళ్ల శ్రీధర్ అనే వ్యక్తి చేసిన ఫిర్యాదు మేరకు నాగేంద్రంను పోలీసుస్టేషన్‌కు పిలిపించామని, విచారణ చేసి పంపించామని తాలూకా సీఐ విజయకృష్ణ తెలిపారు. ఇదిలా ఉండగా అధికార పార్టీకి చెందిన ఒక వివాదాస్పద నాయకుడి ప్రోత్సాహంతోనే నాగేంద్రంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తం మీద కూటమి నాయకుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది.

జగనన్న పర్యటనను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్ సీపీ సైన్యానికి ధన్యవాదాలు
- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు

ఒంగోలు టౌన్:

వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం విజయవంతం స్ఫూర్తితో పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు జిల్లాకు వస్తున్న పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను కూడా విజయవంతం చేయాలని పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు పిలుపునిచ్చారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు ఈ నెల 28వ తేదీ పొదిలి పొగాకు బోర్డు వద్దకు జగన్ వస్తున్నారని తెలిపారు. పొగాకు రైతులకు చరిత్రలో ఎన్నడూ లేనంతగా వైఎస్సార్ సీపీ పాలనలో మంచి గిట్టుబాటు ధర లభించిందని తెలిపారు. కూటమి పాలనలో పొగాకుకు సరైన ధరలు లేక, అమ్ముడుపోక రైతులు అల్లాడుతున్నారని చెప్పారు.

అందరికీ ధన్యవాదాలు...

వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేసిన జగనన్న సైనికులు ప్రతిఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చుండూరి రవిబాబు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పార్లమెంటు ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ పెద్దలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశాన్ని బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్‌రావు, మండల అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి, మన్నే శ్రీనివాసరావు, నగర కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల కమిటీల నాయకులు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు.



చుండూరి రవిబాబు

పొగాకు ధరలపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము్మరి కనకారావు

నాగులుప్పలపాడు: రాష్ట్రంలో పొగాకు రైతులతో పాటు ఇతర పంటలు పండించిన రైతాంగానికి మద్దతు ధరలు కల్పించకుండా ప్రభుత్వం వివక్ష చూపుతోందని, అది తగదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్ము్మరి కనకారావుమాదిగ అన్నారు. జిల్లాలో గిట్టుబాటు ధరలకు పొగాకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించి వారికి అండగా నిలిచేందుకు ఈ నెల 28వ తేదీ మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలిలో నేరుగా రైతులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. పొగాకు రైతులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సోమవారం నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కనకారావు మాట్లాడారు. ఈ ఏడాది పొగాకు పంట సాగుచేసిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వారి జీవితంలో ఎన్నడూ ఎదుర్కోలేదన్నారు. గత ప్రభుత్వంలో పొగాకు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేటై ఇలాగే రైతులను ఇబ్బందిపెట్టాలని చూసిన సందర్భంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేరుగా మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న పొగాకు కొనుగోలు చేయడంతో పాటు రూ.3,500 కోట్లతో రైతుల కోసం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారన్నారు. తద్వారా మిగతా పంటలకు కనీస మద్దతు ధర ఇప్పించిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాది కాలంగా రైతులు పడుతున్న తీవ్ర ఇబ్బందులు చూస్తూ కూడా గుడ్డిగా వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం కళ్లుతెరిచి రైతుల వద్ద ఉన్న పొగాకు పంటతో పాటు మిగతా పంటలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలినేని కోటేశ్వరరావు, రైతు విభాగం మండల అధ్యక్షుడు తగిరిస సుబ్బారావు, గ్రీవెన్సు సెల్ రాష్ట్ర కార్యదర్శి పేరాల చెన్నకేశవులు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జెట్టి శ్రీనివాసరావు, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు రేణు, పార్టీ నాయకులు గండు హరిబాబు, యడవల్లి మోహనరావు, రైతులు అక్కి సాంబశివరావు, నల్లూరి సుబ్బారావు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్ము్మరి కనకారావు

న్యూస్‌రీల్

కాకాణి అరెస్ట్ దుర్మార్గం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



ఒంగోలు సిటీ: ఎవరో ఇచ్చిన అబద్ధపు వాంగ్మూలం ఆధారంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డిని అరెస్ట్ చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కాకాణి అక్రమ అరెస్టును ఖండించారు. ఆదివారం కాకాణిని అరెస్టు చేశామని పోలీసు ధ్రువీకరించారన్నారు. అప్పటి నుంచి ఎక్కడ ఉంచారు, ఎక్కడికి తీసుకెళ్తున్నారన్న కనీస సమాచారం కూడా లేకుండా గోప్యంగా ఉంచడం చట్టవిరుద్ధమన్నారు. మంత్రిగా పనిచేసిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినప్పుడు కనీస సమాచారం ఇవ్వాలన్న బాధ్యత పోలీసులకు లేకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎప్పుడూ ఈ విధంగా అక్రమ కేసులు నమోదు చేయలేదని, గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కాకాణిపై పెట్టిన అక్రమ కేసుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చట్టబద్ధంగా పోరాటం చేస్తుందన్నారు. ఈ కేసులో క్లీన్ చీట్‌తో కాకాణి బయటికి వస్తారన్న నమ్మకం తమకు ఉందన్నారు. వైఎస్సార్ సీపీ కేడర్ మొత్తం కాకాణికి అండగా నిలుస్తుందన్నారు.

హెచ్ఎంల పదోన్నతులకు నేడు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఒంగోలు సిటీ: జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ కింద పని చేస్తూ స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన వారి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తున్నట్లు డీఈఓ ఏ కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. పదోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ యాజమాన్యం కింద 83 ఖాళీలున్నట్లు తెలిపారు. 249 మందితో జాబితా ఉందన్నారు. మొదటిరోజు ఈ నెల 27వ తేదీ 120 మంది, 29వ తేదీ మిగిలినవారి సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నట్లు తెలిపారు. అందరూ హాజరుకావాలని కోరారు. మున్సిపల్ యాజమాన్యం కింద 4 ఖాళీలున్నాయని, 12 మంది జాబితా ఉందని తెలిపారు. ఈ జాబితాలో ఉన్నవారు ఈ నెల 27వ తేదీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం కింద ఒక ఖాళీ ఉందని, ముగ్గురు జాబితా ఉందని, వీరు ఈ నెల 27వ తేదీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకావాలని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుగు స్కూల్ అసిస్టెంట్లు వారి సేవా పుస్తకం, విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకుని డీఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్లో హాజరు కావాలని కోరారు.

గుంటూరు జోన్–3 పరిధిలో...

గుంటూరు జోన్–3 పరిధిలోని ప్రభుత్వ యాజమాన్యాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, తత్సమానమైన కేడర్లలో పనిచేస్తున్న వారికి ప్రధానోపాధ్యాయులు గ్రేడ్–2గా పదోన్నతి కల్పిస్తున్న సందర్భంగా ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, పాఠశాల విద్య, గుంటూరు వారి కార్యాలయంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చేవారు తప్పనిసరిగా సేవా పుస్తకాలు, ఒరిజినల్ కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతల సర్టిఫికెట్లతో రావాలని సూచించారు. జోన్–3 పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు పాత జిల్లాల్లోని ప్రభుత్వ స్కూల్ అసిస్టెంట్లు సీనియారిటీ జాబితాలో సీరియల్ నంబర్ 1 నుంచి 75 వరకు పేర్లున్న వారు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ప్రహసనంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ

ఒంగోలు సిటీ : ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ప్రహసనంగా సాగుతోంది. అడుగడుగూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు తిప్పలు పడుతున్నారు. ఆన్‌లైన్ సమస్య పరిష్కరిస్తున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నా అడపాదడపా సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. సోమవారం వరకూ సుమారు 6,650 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. అందులో ప్రధానోపాధ్యాయులు 141 మంది, పీఎస్ హెచ్ఎంలు 149 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే స్కూల్ అసిస్టెంట్‌లకు సంబంధించి లాంగ్వేజస్ 2,660, నాన్ లాంగ్వేజస్ 3700 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పకోవద్దు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: సమస్యలు పరిష్కరించకుండా ప్రజలను తరచూ ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటే ఊరుకునేది లేదని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను హెచ్చరించాడు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిని ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వాటికి అర్థవంతమైన సమాధానమిస్తూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీలు పెండింగ్ ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు ప్రతిరోజూ లాగిన్ అయి ఆన్‌లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ బి.చినఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్, వరకుమార్, జాన్సన్, విజయ జ్యోతి, డిప్యూటీ కలెక్టరు పార్థసారధి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూన్ 26న ఒంగోలుకు షర్మిల

ఒంగోలు వన్‌టౌన్: ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా ఒంగోలు రానున్నట్లు ఆ పార్టీ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 26న షర్మిల ఒంగోలు పర్యటన ఖరారైనట్లు పేర్కొన్నారు.

బ్యాంక్ ఖాతాలు ఎన్‌పీసీఐతో అనుసంధానం చేసుకోవాలి

ఒంగోలు వన్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు బదిలీకి లబ్ధిదారులు తమ బ్యాంక్ ఖాతాలను ఎన్‌పీసీఐతో అనుసంధానం చేసుకోవాలని ప్రకాశం తపాలా డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్ సాధిక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రకాశం తపాలా డివిజన్ పరిధిలో 11,108 మంది లబ్ధిదారులు తమ బ్యాంక్ ఖాతాలను ఇప్పటి వరకూ అనుసంధానించుకోలేదని స్పష్టం చేశారు. అన్ని గ్రామ కార్యదర్శులు, వార్డు కార్యదర్శులు, పోస్టల్ సిబ్బంది సమన్వయంతో నూతన ఆధార్ సీడెడ్ ఖాతాలను ప్రారంభించడంతోపాటు ఉన్న ఖాతాలకు ఆధార్ సీడింగ్ చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు ప్రకాశం తపాలా డివిజన్ పరిధిలోని 451 పోస్టల్ కార్యాలయాల్లో ప్రత్యేక సీడింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబర్‌తో ఉన్న సెన్ ఫోన్‌తో సంప్రదిస్తే ఎన్‌పీసీఐతో అనుసంధానం చేస్తారని తెలిపారు.

లెదర్ టెక్నాలజీపై ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: లెదర్ టెక్నాలజీపై డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిడాప్, లిడ్‌క్యాప్ ద్వారా ఇచ్చే ఉచిత శిక్షణకు కనీసం 5వ తరగతి, ఆపైన చదవి ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల వయసున్న ఎస్సీ కులాల వారు అర్హులని స్పష్టం చేశారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అదే విధంగా లెదర్ స్టిచింగ్, కటింగ్ కోర్సుకు 10 తరగతి పాస్ లేదా ఫెయిలైన వారు అర్హులని, రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, కుల, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఒంగోలు భాగ్యనగర్ 4వ లైన్ 11వ అడ్డరోడ్డులోని టీటీడీ సెంటర్, కనిగిరి మాచవరంలోని అగ్రికల్చర్ కాలేజీలో సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 9398052599ను సంప్రదించాలని సూచించారు.

మేయర్‌పై తిరుగుబాటు..
రెబల్స్‌తో తలపోటు!

- ఒంగోలు నగర కార్పొరేషన్‌లో మేయర్ పదవిపై లొల్లి
- టీడీపీలో రెబల్స్‌గా మారిన 'జంపింగ్' కార్పొరేటర్లు
- మేయర్ సుజాతను మార్చాలంటూ ఎమ్మెల్యే వద్ద పంచాయితీ
- కౌన్సిల్ హాల్లో మీటింగ్.. రెబల్స్‌కు బుజ్జగింపులతోపాటు బెదిరింపులు
- వాటాల పంపకాల్లో తేడాతోనే గందరగోళ పరిస్థితి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్

ఒంగోలు సబర్బన్:

ఒంగోలు నగర పాలక సంస్థలో అధికార కూటమి ప్రభుత్వానికి చెందిన కార్పొరేటర్లు రెండు గ్రూపులుగా విడిపోయారు. తొలి నుంచీ టీడీపీలో ఉన్న కార్పొరేటర్లది ఒక మాటైతే.. వైఎస్సార్ సీపీ నుంచి జంప్ జిలానీలుగా మారిన కార్పొరేటర్లది మరో మాటగా ఉంది. మేయర్ జి.సుజాతపై గుర్రుగా ఉన్న జంప్ జిలానీలు గత రెండు రోజులుగా తమ ఆలోచనలకు పదునుబెట్టారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల తర్వాత వైఎస్సార్ సీపీ నుంచి మేయర్‌తో మొత్తం 16 మందికి పైగా కార్పొరేటర్లు ప్రలోభాలకు లొంగిపోయి టీడీపీ కండువా కప్పుకొన్న సంగతి తెలిసిందే. అయితే టీడీపీలోకి జంప్ అయిన కార్పొరేటర్లు అక్కడ కూడా నిలకడగా ఉంటున్న పరిస్థితి కనిపించడం లేదు. నిన్నామొన్నటి వరకు మేయర్‌తో అంటకాగిన ఆ కార్పొరేటర్లు ఇప్పుడు ఆమెపై తిరుగుబాటు జెండా ఎగురవేశారు. 14 మంది కార్పొరేటర్లు ఆదివారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి మేయర్‌ను దించేయాల్సిందేనంటూ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. వీరితో రెండు సార్లు చర్చలు జరిపిన ఎమ్మెల్యే దామచర్ల సోమవారం ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కౌన్సిల్ హాల్లో టీడీపీ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నుంచి జంప్ అయిన కార్పొరేటర్లు, మేయర్, అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మేయర్‌కు, పార్టీలో రెబల్స్‌గా మారిన కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణకు మధ్య అగాధంపై సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. అధికారులకు, మేయర్‌కు, రెబల్ కార్పొరేటర్లకు మధ్య ఏం జరుగుతోందనే విషయంపై ప్రత్యేకంగా చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. ఎమ్మెల్యే దామచర్ల ఒక పక్క రెబల్ కార్పొరేటర్లను బుజ్జగిస్తూనే మరోపక్క బెదిరింపు ధోరణిని ప్రదర్శించినట్లు తెలిసింది. నగరపాలక సంస్థలో గందరగోళ పరిస్థితులకు ప్రధాన కారణం.. పనుల్లో పర్సెంటేజీలు, కమీషన్లు, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల్లో వచ్చే వాటాల పంపకాల్లో విభేదాలేనన్నది సమావేశంలో స్పష్టమైంది. పథకాలపై సమీక్ష పేరుతో రెబల్ కార్పొరేటర్లను శాంతింపజేయడమే ధ్యేయంగా సమావేశం సాగినట్లు సమాచారం.


సమావేశంలో పాల్గొన్న టీడీపీ కార్పొరేటర్లు, అధికారులు

కౌన్సిల్ హాలా? పార్టీ ఆఫీసా?

నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కౌన్సిల్ హాల్లో కేవలం టీడీపీ కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయడంపై కూటమి కార్పొరేటర్లే మండిపడుతున్నారు. నగర అభివృద్ధిపై సమీక్ష అని చెప్పి మిగతా కార్పొరేటర్లకు సమాచారం లేకుండా కేవలం టీడీపీ వారినే పిలవడంలో ఆంతర్యమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులను సైతం సమావేశంలో భాగస్వాములను చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెబల్స్‌ను బుజ్జగించేందుకైతే పార్టీ కార్యాలయంలోనో లేక హోటళ్లలోనో సమావేశం ఏర్పాటు చేసుకోవాలి కానీ కౌన్సిల్ హాల్లో రాజకీయాలు చేయడం సరికాదని కూటమిలోని పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు.

బ్యాంకు లోన్ పేరుతో రూ.57 లక్షలకు టోకరా

- ఎస్పీ దామోదర్‌కు బాధితుడి ఫిర్యాదు
- పోలీస్ గ్రీవెన్స్‌కు 73 అర్జీలు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: బ్యాంకు లోన్ పేరుతో ఒక పరిశ్రమ యజమాని వద్ద రూ.57 లక్షలు కాజేశాడు ఓ కేటుగాడు. చేతిలో ఉన్న డబ్బు మొత్తం పోగొట్టుకున్నాక కానీ తాను మోసపోయానని బాధితుడికి అర్థం కాలేదు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఎదుట తన గోడు వెళ్లబోసుకున్నారు. ఒంగోలుకు చెందిన ఒక పరిశ్రమ నిర్వాహకుడిని గుంటూరుకు చెందిన ఒక వ్యక్తి క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ పేరుతో సంప్రదించాడు. 50 శాతం సబ్సిడీపై బ్యాంకు లోన్ ఇప్పిస్తానని, అందుకుగాను క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ పేరు మీద కొంత నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని నమ్మించాడు. వెనకా ముందు ఆలోచించకుండా గుడ్డిగా బాధితుడు రూ.57 లక్షలు ఫిక్స్‌డ్ చేశాడు. ఆ తర్వాత క్రెడిట్ సొసైటీ గురించి వాకబు చేయగా అలాంటి సంస్థ ఏదీ లేదని తెలిసింది. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరగా సదరు వ్యక్తి బెదిరింపులకు దిగాడు. దీంతో ఎస్పీని కలిసి మోసపోయిన తీరును వివరించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఆన్‌లైన్ గేమ్ పేరుతో దగా

కనిగిరి పట్టణానికి చెందిన ఒక మహిళ వాట్సప్‌కు కొంత నగదు ఇన్వెస్ట్ చేసి టెలిగ్రామ్‌లో గేమ్ ఆడితే భారీగా డబ్బు గెలుచుకోవచ్చని ఆశ పెట్టారు. ఇదంతా నిజమని నమ్మిన సదరు మహిళ విడతల వారీగా 1.15 లక్షల రుపాయలను ఫోన్ పే చేశారు. అయినప్పటికీ సంతృప్తి చెందని మోసగాడు ఇంకా అదనంగా డబ్బు చెల్లించాలని మెసేజ్ పంపించడంతో మోసపోయినట్లు గుర్తించి ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

■ విజయవాడ రైల్వే స్టేషన్లో ఔట్‌సోర్సింగ్‌లో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ విజయవాడకు చెందిన ముగ్గురు వ్యక్తులు 25 వేల రుపాయలు అడ్వాన్స్‌గా తీసుకున్నారని, ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బు కూడా తిరిగివ్వడం లేదని సంతనూతలపాడుకు చెందిన బాధితుడు ఫిర్యాదు చేశారు. ఇలా జిల్లా నలుమూలల నుంచి పోలీస్ గ్రీవెన్స్‌కు మొత్తం 73 ఫిర్యాదులు అందాయి. బాధితుల సమస్యలు విన్న ఎస్పీ దామోదర్ ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడి చట్టపరంగా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ సురేష్ బాబు, సీసీఎస్ సీఐ జగదీష్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, డీటీసీ సీఐ షమీవుల్లా, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, నాగులుప్పలపాడు ఎస్సై షేక్ రజియా సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తి అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

కంభం: బాలికపై అత్యాచారానికి ప్రయత్నించిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు కంభం ఎస్సై బి. నరసింహారావు తెలిపారు. కేసు వివరాలను సోమవారం ఆయన మీడియాకు వెల్లడించారు. వివరాలు.. ఈనెల 23వ తేదీన మండలంలోని జంగంగుంట్ల గ్రామానికి చెందిన మునిగేటి శౌరయ్య అనే వృద్ధుడు అదే గ్రామానికి చెందిన ఓ బాలికకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడాడు. అదే రోజు మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికపై లైంగికదాడి చేసేందుకు ప్రయత్నించాడు. బాలిక భయపడి కేకలు వేయడంతో వృద్ధుడు అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఉదయం కంభం-జంగంగుంట్ల మధ్యలో హైవే రోడ్డుపై కందులాపురం అడ్డరోడ్డు వద్ద నిందితుడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనూక్

- అమ్మవారి ఆభరణాలు, హుండీలోని నగదు అపహరణ

పొన్నలూరు: పోలేరమ్మతల్లి దేవాలయంలో దొంగలుపడి అమ్మవారి ఆభరణాలు, హుండీలోని నగదు చోరీ చేశారు. ఈ సంఘటన పొన్నలూరు మండల పరిధిలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. నాగిరెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో గత నెల 29వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ నేపథ్యంలో అమ్మవారికి రూ.50 వేల విలువైన వెండి ఆభరణాలు చేయించారు. అలాగే దేవాలయంలో రెండు సార్లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులు పెద్ద మొత్తంలో కానుకలు సమర్పించారు. అయితే ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడి తాళం పగలగొట్టి అమ్మవారి కిరీటం, ముక్కుపుడక, మరి కొన్ని ఆభరణాలు అపహరించారు. హుండీలో సుమారు రూ.10 వేల నగదును కాజేశారు. గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లారు. పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనూక్ తెలిపారు.

కురిచేడు చేరిన సాగర్ జలాలు


దర్శి బ్రాంచి కాలువలో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

కురిచేడు: జిల్లా ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం విడుదల చేసిన సాగర్ జలాలు సోమవారం కురిచేడు చేరాయి. పది రోజులపాటు సరఫరా అయ్యే ఈ నీటితో రక్షిత నీటి పథకాల చెరువులను నింపాల్సి ఉందని, చేపల చెరువులు, నాన్ నోటిఫైడ్ చెరువులకు మళ్లిస్తే చర్యలు తీసుకుంటామని ఎన్ఎస్పీ డీఈఈ అక్బర్‌బాషా హెచ్చరించారు. సాగర్ ప్రధాన కాలువపై 9 రక్షిత నీటి పథకాలు ఉన్నట్లు తెలిపారు. సాగర్ డ్యాం వద్ద 5,500 క్యూసెక్కులు, 85/3 మైలు జిల్లా సరిహద్దు వద్ద 1793 క్యూసెక్కులు, దర్శి బ్రాంచి కాలువ హెడ్ రెగ్యులేటర్ 126వ మైలు కురిచేడు వద్ద 884 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతోందని వివరించారు.

జీజీహెచ్‌లో క్యాన్సర్ నిర్ధారణ పరికరం

ఒంగోలు టౌన్: పీజీ నిధులతో జీజీహెచ్‌కు మరో సరి కొత్త వైద్య పరికరం సమకూరింది. క్యాన్సర్ నిర్ధారణ, నివారణకు ఉపయోగపడే ఇమ్యునో హిస్టో కెమిస్ట్రీ(ఐహెచ్‌సీ) పరికరాన్ని సోమవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజీ నిధులు రూ.40 లక్షలతో ఐహెచ్‌సీ పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇమ్యూనో హిస్టో కెమిస్ట్రీ పరికరం క్యాన్సర్ ఏ రకానికి చెందినదో కచ్చితంగా నిర్ధారిస్తుందని పేర్కొన్నారు. వ్యాధి నివారణకు ఏ రకమైన మందులను ఎంత డోస్ వాడాలి, ఎంత కాలం వాడాలన్నది ఐహెచ్‌సీ సాయంతో తెలుసుకోవచ్చన్నారు. రోగులకు ఓవర్ డోస్ సమస్య ఉత్పన్నం కాదన్నారు. మహా నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే ఐహెచ్‌సీని జిల్లా ప్రజలతోపాటుగా వైద్య రంగంలోని వారు కూడా వినియోగించుకోవాలని సూచించారు.


ఐహెచ్‌సీ వైద్య పరికరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఏడుకొండలు

కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు దుర్గాదేవి, సుధాకర్, సుధాకర్ బాబు, కమ్యూనిటీ మెడిసిన్ శ్రీదేవి, మైక్రో బయాలజీ పద్మప్రియ, సర్జికల్ ఆంకాలజిస్ట్ కిషన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకోం

- కార్మిక సంఘాల హెచ్చరిక

ఒంగోలు టౌన్: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించేది లేదని చెబుతూనే కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిలో ప్రయత్నాలు చేస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ చుండూరు రంగారావు విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రూ.11 వేల కోట్ల నిధులు ఇచ్చినట్లు గొప్పగా చెప్పుకున్న కేంద్ర ప్రభుత్వం 4 వేల మంది కార్మికులను విధుల నుంచి తొలగించిందని, మూడు నెలలుగా వేతనం ఇవ్వకుండా ఆపేయడం దుర్మార్గమన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకొని తీరుతామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి కార్మికులను ఏకం చేసి పోరాడుతామన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమారెడ్డి మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చీకటి శ్రీనివాసరావు, ఎస్డీ సర్దార్, పేరయ్య, శేషయ్య, రాంబాబు, రమేష్, తంబి శ్రీనివాసరావు, బీవీ రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

మంచి శకునం..
అంతా క్షేమం!

- జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో 4 రోడ్డు ప్రమాదాలు
- 8 మందికి తీవ్ర, నలుగురికి స్వల్పంగా గాయాలు


సింగరాయకొండ : బోల్తాపడిన కారును పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర


పీసీపల్లి : నుజ్జునుజ్జయిన ఆటో, బైక్


కురిచేడు : క్షతగాత్రులను వినుకొండ తరలిస్తున్న 108 సిబ్బంది

కురిచేడు/పీసీపల్లి/సింగరాయకొండ/కొమరోలు: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో 12 మందికి గాయాలు కాగా మరికొందరు సురక్షితంగా బయటపడ్డారు. లేచిన వేళా విశేషం మంచిదైందని, లేదంటే ప్రాణాలు దక్కేవి కాదని క్షతగాత్రులు అభిప్రాయపడ్డారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన కురిచేడు మండలంలోని పొట్లపాడు-గంగదొనకొండ గ్రామాల మధ్య చోటుచేసుకుంది. క్షతగాత్రుల కథనం మేరకు పల్నాడు జిల్లా కారంపూడి మండలం బ్రహ్మనాయుడు కాలనీకి చెందిన 14 మంది ఆటోలో ప్రకాశం జిల్లాలోని కనిగిరి-పామూరు మధ్య అట్లావారిపల్లె గ్రామంలోని అమ్మవారి ఆలయంలో మొక్కు చెల్లించి వస్తున్నారు. గంగదొనకొండ గ్రామం దాటగానే మూలమలుపులో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి వీరి ఆటో బోల్తా పడింది. చల్లంచర్ల సిద్ధేశ్వరరావు, అల్లూరి నాగరాజు, ఇండ్ల నాగార్జునకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు వారు ప్రయాణించిన ఆటోలోనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేశారు.

ఆటో, బైక్ ఢీ..

మోటార్ సైకిల్‌ను ఆటో ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పీసీపల్లి పరిధిలోని వెంగళాపురం సమీపంలో పంచలింగాల కొండ ఆలయం ఎదురుగా చోటుచేసుకుంది. వెంకుపాలెంలో తిరునాళ్లకు వెళ్లి పెద్దఅలవలపాడు వస్తుండగా ఆటో డ్రైవర్ రాము సడన్ బ్రేక్ వేయడంతో మూడు పల్టీలు కొట్టి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బేస్తవారిపేట మండలం సోమవారపేటకు చెందిన సీహెచ్ బ్రహ్మయ్య, ఆటో డ్రైవర్ రాము, అతని తల్లి విజయమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


పీసీపల్లి : గాయపడ్డ ఆటో డ్రైవర్ రాము, బ్రహ్మయ్య


కొమరోలు : గాయపడిన పి.రాజశేఖర్, డి.శేఖర్

కారును ఢీకొన్న లారీ

ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొనడంతో కారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటన సోమవారం జాతీయరహదారిపై కలికవాయ ఫ్లయ్‌ఓవర్‌పై చోటుచేసుకుంది. హైవే పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నిమ్మల చంద్రశేఖరరావు, రాజేశ్వరి, కాకుమాని అంజన్‌రావు, చిలకమ్మ దంపతులు తిరుమల వెళ్లి వస్తున్నారు. వీరి కారు కలికవాయ ఫ్లయ్ ఓవర్ పైకి రాగానే వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రులకు హైవే అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై బి మహేంద్ర పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కొమరోలు మండలంలోని అయ్యవారిపల్లె సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. బైక్‌పై ప్రయాణిస్తున్న తాటిచెర్ల గ్రామానికి చెందిన పి.రాజశేఖర్, డి.శేఖర్‌కు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.